భోగి మంటలు.. సంక్రాంతి వేడుకలు


భోగి వేడుకల్లో పాల్గొన్న ఎన్విరాన్ కాలనీవాసులు

కూకట్‌పల్లి నియోజకవర్గ జంట సర్కిళ్ల పరిధిలో ఆదివారం భోగి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం పలు అపార్టుమెంట్ వాసులు భోగి మంటలు వేసి సందడి చేశారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో భోగి వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నారు. దక్షిణాయానం నుంచి ఉత్తారాయణం ప్రారంభం కానుండటంతో కాలంతో వచ్చే మార్పులను ఆహ్వానించడానికి సిద్ధంగా ఉండాలని బోధించేదే భోగి పండుగ అని వివరించారు. మహిళలు రంగు రంగులతో ముగ్గులు వేశారు. చిన్నారులు పతంగులను ఎగరవేసి సందడి చేశారు. – కూకట్‌పల్లి


భోగి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన సత్యంగౌడ్ తదితరులు


భోగి మంటల వద్ద ధరణినగర్ సొసైటీ సభ్యులు


శ్రీవివేకానందనగర్‌లో భోగి వేడుకల్లో పాల్గొన్న మస్తాన్‌రెడ్డి తదితరులు


భోగి వేడుకల్లో పాల్గొన్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆయన కుటుంబ సభ్యులు


శ్రీవివేకానందనగర్‌లో వేసిన భోగి మంటల వద్ద సంక్షేమ సంగం అధ్యక్షులు రోణంకి జగన్నాథం

భారీగా పెరిగిన పతంగుల ధరలు

శేరిలింగంపల్లి: సంక్రాంతి అంటేనే భోగి మంటలు, ముగ్గులతో పాటు పతంగులు ఎగురవేయడం ఆనవాయితీ. ఈక్రమంలో ఏటా శేరిలింగంపల్లిలోని తారానగర్ మార్కెట్‌లో ప్రత్యేకంగా పతంగులు, మాంజా, దారం విక్రయాలు భారీగా కొనసాగుతాయి. చుట్టూ ఉండే కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీవాసులు ఇక్కడికే వచ్చి కొనుగోళ్లు చేస్తుంటారు. అయితే, పతంగుల రేట్లు భారీగా పెరిగాయి. ఆదివారం తారానగర్ మార్కెట్‌లో ఒక్కో పతంగు రూ.5 నుంచి రూ.80 వరకు విక్రయించారు. అదేవిధంగా కేవలం దారంతో తయారు చేసిన స్థానిక మాంజా ఒకటి రూ.600 నుంచి రూ.800 వరకు ఉండటం విశేషం. గతంలో విక్రయాలు బాగా సాగేవని, ప్రస్తుతం అంతగా కొనుగోళ్లు లేవని వ్యాపారులు చెబుతున్నారు.

ఆలయాల్లో సంక్రాంతి పూజలు

రాయదుర్గం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఇందులో భాగంగా గచ్చిబౌలిలోని శివ సాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలను ఆదివారం ఉదయం నిర్వహించారు. కాశీ విశ్వేశ్వర స్వామి, అన్నపూర్ణాదేవి, గణపతి, షిర్డీ సాయిబాబా, ఆంజనేయ స్వామి, ఇతర దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి, అర్చకుల పర్యవేక్షణలో ఈ పూజలు నిర్వహించారు.

1969 ఉద్యమకారులకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

బంజారాహిల్స్: 1969 తెలంగాణ ఉద్యమకారుల తరఫున గత 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి అంకితభావంతో పనిచేస్తున్న తనకు ఈ దఫా తెలంగాణ ఉద్యమకారుల తరుపున ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ ఉద్యమకారుల సమితి సెక్రటరీ జనరల్ దుశర్ల సుదర్శన్‌రావు ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీని కలిసి విజ్ఞప్తి చేశారు. తాము ఎన్నో కష్టనష్టాలకోర్చి పోలీసులతో దెబ్బలుతిని పోలీసు కేసులు నమోదైనా తెలంగాణ కోసం పోరాడామని, 1969 తెలంగాణ ఉద్యమకారులకు ఎప్పుడూ అన్యాయమే జరుగుతుందని, కనీసం ఈ సారైనా న్యాయం చేయాలని ఆయన కోరారు. తాను 1967 నుంచి కాంగ్రెస్ పార్టీకి పనిచేస్తున్నానని, సంజయ్‌గాంధీ, రాజీవ్‌గాంధీలతో మంచి అనుబంధం ఉండేదని, తెలంగాణలో కాంగ్రెస్ ఉన్నా లేకున్నా ఆ పార్టీకి నిబద్ధతతో పనిచేశానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేయడం జరిగిందన్నారు. ఎంతో మంది ముఖ్యమంత్రులతో పనిచేశానని, గాంధీభవన్‌కు ఎప్పుడూ కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. ఈ సారి ఎమ్మెల్సీ అవకాశం తనకు కల్పించడం ద్వారా తెలంగాణ ఉద్యమకారులను గౌరవించినట్లవుతుందని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.

క్రికెట్ టోర్నీ విజేతకు ట్రోఫీ ప్రదానం

ఖైరతాబాద్: పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ సీఎల్పీ నాయకులు దివంగత పి.జనార్ధన్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఖైరతాబాద్ డివిజన్‌లో రెండు రోజులుగా నిర్వహించిన పీజేఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నీలో జంట నగరాల నుంచి 60 జట్లు పోటీ పడ్డాయి. విజేతగా నిల్చిన శాఖ స్ట్రైకర్స్ (ఖైరతాబాద్) టీంకు ఫౌండేషన్ చైర్మన్, కార్పొరేటర్ విజయారెడ్డి ట్రోఫీతోపాటు రూ. 25 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. రన్నరప్‌గా నిల్చిన ఇమ్రాన్ సీసీ టీంకు ట్రోఫీతో పాటు రూ. 10 వేల ప్రోత్సాహక బహుమతిని ప్రదానం చేశారు.

రోహిత్ వేముల వర్ధంతిని దేశవ్యాప్తంగా నిర్వహించాలి

హిమాయత్‌నగర్: దళిత బహుజన విద్యార్థి మేధావి రోహిత్ వేముల చక్రవర్తి 8వ వర్ధంతి సభలను జనవరి 17న దేశ వ్యాప్తంగా నిర్వహించాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) కేంద్రంగా ప్రజాస్వామ్యం, సెక్యూలర్, రిపబ్లిక్, సోషలిస్ట్ భావజాల వాతావరణాన్ని కాపాడుకోవడం కోసం అంబేడ్కర్ ఆశయాలు సాధన కోసం ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, ఏబీవీపీ దోపిడీ రాజకీయాల పైన తిరుగుబాటు చేసిన గొప్ప మేధావి అని, రోహిత్ వేముల త్యాగాలను,స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ని భారతీయ మజ్దూర్ సంఘ్ ఆటో విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ కలిశారు. ఆదివారం ఆయనను కలిసి అభినందనలు తెలిపి ఆత్మీయ సత్కారం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా శాసనసభలో సమయం కేటాయించాలని విన్నవించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ. 12 వేలు అందేలా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆటో డ్రైవర్లకు రుణాలు ఇప్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు విషయంలో ఆటో డ్రైవర్లకు ప్రాధన్యాత ఇవ్వాలని కోరారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి

జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ యాదవ్



హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, బీసీలకు 50 శాతం కేటాయించాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్ యాదవ్ డిమాండ్ చేసారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. అణగారిన వర్గాలకు రాజకీయంగా అవకాశాలు కల్పించాలని సోనియా గాంధీ, ఖర్గే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు విజ్ఞప్తి చేశారు. బీసీలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి తగిన న్యాయం చేయాలని రాజేశ్వర్ యాదవ్ కోరారు.

విజయగణపతికి కేజీ వెండి విరాళం



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ 9వ ఫేజులోని విజయ గణపతి దేవస్థానంకు కేపీహెచ్‌బీ కాలనీ వాకర్స్, యోగా అసోసియేషన్ ఇన్‌చార్జి పి. వేణుగోపాల్-1 కేజీ వెండిని స్వామివారికి విరాళంగా అందజేశారు. ఆదివారం దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ వెండిని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస రావు చేతులు మీదుగా దేవాలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి రమేష్, తదితరులు

మోతీనగర్: ఎన్ఎస్‌యుఐ 2024 నూతన సంవత్సరం కేలండర్‌ను కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, మూసాపేట డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గోపిశెట్టి రాఘవేందర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ మిస్బాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్‌యూఐ కూకట్‌పల్లి నియోజకవర్గ కార్యదర్శి సాత్విక్ గోనె, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి సాయికుమార్‌లు నిర్వహించారు. కావేటి నాగార్జున, మేడ్చల్ జిల్లా కార్యదర్శి వంశీ ముదిరాజ్, కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సాయితేజ, శివ, అజయ్‌లు పాల్గొన్నారు.

నేడు ఆలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం

కూకట్‌పల్లి: అయోధ్యలో ఈనెల 22న రామమందిర ప్రారంభోత్సవానికి ముందు, భారతదేశంలోని అన్ని దేవాలయాల ప్రాంగణాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టాలని భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు, సోమవారం ఉదయం 10గంటలకు కూకట్‌పల్లి రామాలయ ప్రాంగణంలో కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మురళీధర్‌రావు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ బంధువులు, కూకట్‌పల్లి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 50, పచ్చ కాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 16, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 35.

సంతోషంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలి


చిన్నారులకు పతంగులను పంపిణీ చేసిన పాపిరెడ్డినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి

ఆల్విన్‌కాలనీ: సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకోవాలని కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పండుగ సందర్భంగా బస్తీలోని పలువురు చిన్నారులకు పతంగులు అందజేశారు. పతంగులను ఎగరవేసేటప్పుడు చిన్నారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, నాయకులు ధర్మారావు, అనంతరాములు, రామకృష్ణారెడ్డి, నర్సిరెడ్డి, ఆనంద్, అశోక్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజిరెడ్డి, నర్సింలు, శ్రీను, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీ


టీఎస్ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొన్న ఉద్యోగులు

మూసాపేట: టీఎస్ఆర్టీసీ కూకట్‌పల్లి డిపోలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం మహిళా ఉద్యోగులకు రంగవల్లి పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీకి డిప్యూటీ ఆర్ఎం కవి, కూకట్‌పల్లి డీఎం ఇషాక్ మహమ్మద్ బిన్, సీఐ శ్రీలత, టీఐటీ సావిత్రి, ఎస్‌టీఐ వెంకటేశంలు పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీలో గెలుపొందిన ఉద్యోగులను అభినందించారు. మొదటి బహుమతి కండక్టర్ గౌతమి, ద్వితీయ బహుమతి కండక్టర్ శైలజ, తృతీయ బహుమతి కండక్టర్ శోభాలకు అందజేశారు. పాల్గొన్న ఉద్యోగులకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు


శ్రీవివేకానందనగర్‌లో జరిగిన కల్యాణంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్


పాండురంగనగర్‌లో జరిగిన గోదా రంగనాథస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గత నెల 17 నుంచి ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు జనవరి 14 శ్రీగోదా రంగనాథ స్వామి కల్యాణంతో ముగిశాయని ఆలయ కార్యనిర్వాహణ అధికారి జీఏకే కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సుమారు నెల రోజుల పాటు ప్రతి రోజు దేవాలయంలో సేవాలకాలం, నివేదన మంగళశాసనం, తీర్థ గోష్టితో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ముగింపు సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీ గోదా రంగనాథ స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు.

◆ అదే విధంగా అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లోని శ్రీభూనీల సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కూడా నెల రోజుల పాటు ధనుర్మాస వేడుకలు ఘనంగా నిర్వహించామని ఆలయ వ్యవస్థాపక కమిటీ చైర్మన్ పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గోదారంగనాథ స్వామి కల్యాణ మహోత్సవంలో శ్రీనివాస్‌యాదవ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


భరత్‌నగర్‌కాలనీలో జరిగిన గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

గోదా రంగనాథస్వామి కల్యాణం...

పాండురంగానగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన గోదా రంగనాథ స్వామి కల్యాణం ఆదివారం నిర్వహించారు. ఈ కల్యాణంలో ఆలయ కార్యనిర్వాహక అధికారి జీఏకే కృష్ణ, చైర్మన్ వీఎన్‌వీ సత్యనారాయణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఐడీఎల్ చెరువు సమీపంలోని శ్రీరంగనాయకస్వామి ఆలయంలో..

మల్కాజిగిరి బీజేపీలో లోకల్ లొల్లి

సాక్షి,మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న తెలంగాణ బీజేపీలో మల్కాజిగిరి లోకల్ లొల్లి తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒకవైపు పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థుల ఎంపికకు అధిష్టానం కసరత్తు చేస్తుండగా మరోవైపు మేడ్చల్ అర్బన్, రూరల్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన నేతలు స్థానికులకే టికెట్ ఇవ్వాలని ఒత్తిడి తేవడం వివాదాలకు కారణమవుతోంది. మరికొందరు మల్కాజిగిరి టికెట్‌పై బహిరంగ చర్చకు దిగడాన్ని తప్పుపడుతూ ఈవిషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళతామని స్పష్టం చేస్తున్నారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరి టికెట్ కోసం నేతల మధ్య నెలకొన్న లోకల్ లొల్లి పార్టీ కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది. పారాచూట్ లీడర్లకు టికెట్ ఇవ్వరాదంటూ మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మూడు జిల్లాలకు చెందిన అధ్యక్షులు అధిష్టానానికి తేల్చి చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

తెరపైకి లోకల్ వివాదం..

మల్కాజిగిరి పార్లమెంట్ సీటుపై బయటి లీడర్ల పెత్తనం ఏమిటని స్థానిక నేతలు లోకల్ నినాదాన్ని తెరపైకి తెస్తున్నారు. మల్కాజిగిరి నుంచి పోటీ చేయాలని కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, మధ్య ప్రదేశ్ పార్టీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత కొమురయ్య చేపడుతున్న కార్యకలాపాలు స్థానిక నేతల కలవరానికి కారణమవుతున్నాయి. బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు గత కొన్నాళ్లుగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పర్యటిస్తూ కేడర్‌తో సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరికొందరు ప్లెక్సీలు ,వాల్ రైటింగ్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో స్థానికుల్లో మల్కాజిగిరి సీటుపై ఆందోళన నెలకొంది. నగరంలో ఇటీవల బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు వన్నాల హరీష్ రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల విక్రంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి మీడియా సమావేశాన్ని నిర్వహించి, మల్కాజిగిరి పార్లమెంట్ టికెట్ స్థానికులకు తప్ప

- పారాచూట్‌లకు టికెట్ వద్దంటూ స్థానిక నేతల అభ్యంతరం
- లోక్‌సభ సీటుపై రచ్చకెక్కిన వివాదం
- నియోజకవర్గం కేడర్‌తోసహా రాజకీయ వర్గాల్లో చర్చ

స్థానికేతరులకు ఇవ్వవద్దని పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో స్థానిక నాయకులు ,కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రాబోయే పురపాలిక, జీపీ ఎన్నికలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయమై కేంద్రమంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి , జాతీయ నాయకుడు ఎంపీ లక్ష్మణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తాము ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతుంటే ఎంపీ టికెట్ కోసం బయటి వ్యక్తుల పేర్లు తెరపైకి తీసుకురావటమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో సమర్థవంతమైన నాయకత్వం ఉందని, ఏళ్ల తరబడి బీజేపీ కోసం పనిచేసిన నాయకులున్నారని, స్థానిక నేతలకు కాకుండా పారాచూట్ లీడర్లకు టికెట్ కేటాయిస్తే .. పార్టీ శ్రేణులకు తప్పుడు సంకేతాలు వెళ్లగలవని వారు హెచ్చరిస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132